మార్కెట్‌కు ఆరు రోజులు సెలవు

కేసముద్రం, ఆగస్టు 13: కేసముద్రం వ్యవసాయ మార్కెట్‌కు ఈ నెల 14 నుంచి 19 వరకు ఆరు రోజులపాటు సెలవులు ప్రకటించినట్లు మార్కెట్ కార్యదర్శి అమరలింగేశ్వరరావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. సాధారణ సెలవులు, స్వాతంత్ర్య దినోత్సవం, రాఖీ పౌర్ణమి సందర్భంగా ఆరు రోజుల పాటు మార్కెట్‌లో క్రయ విక్రయాలు జరగవని పేర్కొన్నారు. ఈ నెల 20 మార్కెట్ ప్రారంభమవుతుందని, ఈ విషయాన్ని రైతులు గమనించాలని పేర్కొన్నారు.

'కమిటీలతో కాలయాపన చేయొద్దు'

మహబూబాబాద్ రూరల్, ఆగస్టు 13 : ఉద్యోగ, ఉపాధ్యాయ సమస్యల పరిష్కారంలో రాష్ట్ర ప్రభుత్వం కమిటీల పేరుతో కాలయాపన చేయొద్దని పీఆర్టీయూ రాష్ట్ర ఆర్థిక కార్యదర్శి పులి దేవేందర్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. 317 బాధిత ఉద్యోగులు ఆగస్టు 15 నాటికి ఎవరి జిల్లాలకు వారు వెళ్తారని కమిటీలు వేసి చాలా రోజులైందని, సమస్య మాత్రం పరిష్కారం కాలేదన్నారు. ఈ జీవో వల్ల చాలామంది ఉపాధ్యాయులు ఇబ్బందిపడుతున్నారని అన్నారు.

సభను బహిష్కరించాలి

గార్ల ఆగస్టు 13 : ఖమ్మం జిల్లా వైరాలో ఈ నెల 15న నిర్వహించే బహిరంగ సభను రైతులు బహిష్కరించాలని బీజేపీ మహిళా మోర్చా జిల్లా అధ్యక్షురాలు గుండెబోయిన నాగమణి మంగళవారం ప్రకటనలో తెలిపారు. గార్ల, బయ్యారం, ఇల్లెందు మండలాల రైతులు నిరసనలు తెలుపాలని పిలుపునిచ్చారు.

అడవి పంది దాడిలో భార్యాభర్తలకు గాయాలు

కొత్తగూడ, ఆగస్టు 13: అడవి పంది దాడిలో భార్యాభర్తలకు గాయాలైన ఘటన మండలంలోని ఓటాయి శివారు చిన్నతండాలో మంగళవారం జరిగింది. స్థానికుల కథనం ప్రకారం.. ఓటాయి శివారులోని చిన్నతండాలో రైతులు వ్యవసాయ పనుల్లో నిమగ్నమయ్యారు. అడవి పందులు ఒక్కసారిగా పంట పొలాల్లో వచ్చాయి. ఈ క్రమంలో బానోత్ లచ్చు పంట పొలానికి మందు కొడుతుండగా అడవి పంది దాడి చేయడంతో తీవ్రగాయాలయ్యాయి. భర్తను కాపాడబోయిన భార్య కౌసల్యపై కూడా దాడి చేయడంతో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. మిగతా రైతులంతా పంట పొలాల నుంచి బయటకు పరుగులు తీశారు. భార్యాభర్తలను వెంటనే దవాఖానకు తరలించి చికిత్స అందించారు.

రూ.94వేలు పోగొట్టుకున్న వ్యాపారి

మహబూబాబాద్ రూరల్, ఆగస్టు 13 : ఓ వ్యక్తి సైబర్ నేరగాడి వలకు చిక్కి రూ.94వేలు పోగొట్టుకున్న ఘటన మంగళవారం పట్టణంలో జరిగింది. టౌన్ సీఐ దేవేందర్ కథనం ప్రకారం.. పట్టణంలోని నెహ్రూసెంటర్‌కు చెందిన శేషగాని శ్రీనివాస్ అనే వ్యాపారి సెల్‌ఫోన్‌కు మధ్యాహ్న సమయంలో ఓటీపీ వచ్చింది. ఆ తర్వాత అపరిచిత వ్యక్తి ఫోన్ చేసి ఓటీపీ అడగడంతో చెప్పగా, మొదటగా రూ.34వేలు, గంట తర్వాత మళ్లీ ఓటీపీ చెప్పడంతో రూ.60వేలు అకౌంట్ నుంచి బదిలీ అయినట్లు మెసేజ్ వచ్చింది. దీంతో మోసపోయినట్లు గుర్తించిన బాధితుడు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

బహిరంగ ప్రకటన

ఇందుమూలముగా సమస్త ప్రజలకు తెలియజేయునది ఏమనగా మహబూబాబాద్ జిల్లా, సిరోల్ మండలం, గుజిలి తండ, కొత్తూరు (C) గ్రామ కాపురస్తులుగ శ్రీ బాదావత్ సుమన్, తండ్రి: మోతిలాల్, నివాసం: గ్రామము గుజిలి తండ, కొత్తూరు(C), మండలం సిరోల్, జిల్లా మహబూబాబాద్ వీరు శ్రీరాం ఫైనాన్స్ లిమిటెడ్ మహబూబాబాద్ బ్రాంచీ వారిని ఋణ సదుపాయం పొందుటకు హామీగా ఈ దిగువ షెడ్యూల్ ఆస్తిని తమ రిజిష్టర్ గిఫ్ట్ దస్తావేజు నెం. 9533/2024, తేది: 26-07-2024, మహబూబాబాద్ సబ్ రిజిస్ట్రార్ వారి సమక్షములో రిజిష్టర్ కాబడిన దాని ద్వారా సంక్రమించిన ఆస్తిని హామీగా ప్రతిపాదించగా సదరు శ్రీరాం ఫైనాన్స్ లిమిటెడ్ వారు తమ సమ్మతిని తెలిపియున్నారు. సదరు షెడ్యూల్ ఆస్తి విషయమై గాని సదరు ఋణ సదుపాయ విషయమైగాని ఎవరికైనా ఎలాంటి అభ్యంతరములు ఉన్నచో ఈ ప్రకటన వెలువడిన (5) దినములలో తగు ఆధారములతో ఈ దిగువ తెలిపిన అడ్రస్ యందు సంప్రదించగలరు. లేని యెడల ఎలాంటి అభ్యంతరములు లేవని తలచి సదరు ఋణ సదుపాయ విషయమై పై కంపెనీ వారు తదుపరి చర్యలు గైకొందురు. గడువు తర్వాత వచ్చిన అభ్యంతరములు పరిగణలోకి తీసుకోబడవు.

షెడ్యూలు ఆస్తి: మహబూబాబాద్ జిల్లా, సిరోల్ మండలం, కొత్తూరు (C) గ్రామపంచాయతీ పరిధిలోని డోర్ నెం. 2-119, విస్తీర్ణం 316.00 చ.గ. లేదా 264.21 చ.మీ.లు గల దానికి హద్దులు: తూర్పు: బాదావత్ రమేష్ గృహము, పడమర: దొంక రోడ్డు, ఉత్తరం: జాటోత్ శ్రీను గృహము, దక్షిణం: జాటోత్ గోపా గృహము.

తేది. 13-08-2024

ఇట్లు: **బి. ఆనంద్ కుమార్,** అడ్వకేట్, మహబూబాబాద్, 506 101, Cell: 9440241819.

మెరుగైన వైద్యం అందించాలి

ఇర్సులాపురం ఆశ్రమ పాఠశాలను పరిశీలిస్తున్న కలెక్టర్ అద్వైత్‌కుమార్ సింగ్

- వైద్య సిబ్బందికి కలెక్టర్ అద్వైత్‌సింగ్ కుమార్ ఆదేశం
- బయ్యారం, గంధంపల్లి హీహెచ్‌సీల్లో ఆకస్మిక తనిఖీలు
- మందులు, సిబ్బంది కొరతను కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లిన వైద్యులు

బయ్యారం, ఆగస్టు 13: ప్రజలకు అందుబాటులో ఉంటూ మెరుగైన వైద్య సేవలు అందించాలని కలెక్టర్ అద్వైత్ సింగ్ కుమార్ వైద్య సిబ్బందిని ఆదేశించారు. మంగళవారం ఆయన బయ్యారం, గంధంపల్లి పీహెచ్‌సీలతో పాటు నామాలపాడు ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ పాఠశాల, ఇర్సులాపురం ఆశ్రమ పాఠశాలను ఆకస్మికంగా సందర్శించారు. సిబ్బంది హాజరు, మందుల స్టాక్ వివరాలు, ఓపీ, ఐపీ రిజిస్టర్లను తనిఖీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. గ్రామాల్లో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా వైద్య సిబ్బంది అప్రమత్తంగా ఉండాలన్నారు. ఏఎన్ఎం, ఆశ కార్యకర్తలు ఇంటింటి సర్వే నిర్వహించి విష జ్వరాలు రాకుండా మాత్రలు అందజేయాలన్నారు. బోదకాల నివారణ కోసం చేపట్టిన మందుల పంపిణీ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని, వ్యాధి రాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. రెండు పీహెచ్‌సీల్లో సిబ్బంది, మందుల కొరత ఉన్నదని వైద్యాధికారులు సాగర్, విజయ్‌కుమార్ కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. అనంతరం నామాలపాడు ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ పాఠశాల, ఇర్సులాపురం ఆశ్రమ పాఠశాలను సందర్శించారు. డైనింగ్ హాల్, కిచెన్, తరగతి గదులు, గ్రౌండ్‌ను పరిశీలించారు. పిల్లలకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా సౌకర్యాలు కల్పించాలని, రుచికరమైన భోజనం అందించాలని సిబ్బందిని ఆదేశించారు. పదోతరగతిలో మంచి ఫలితాలు సాధించేలన్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ విజయ, ఎంపీడీవో దైవాదినం, ఆర్ సీవో హరిసింగ్, డాక్టర్ విజయ్‌కుమార్, డాక్టర్ సాగర్, కళావతి, రజిత, పవన్ తదితరులు పాల్గొన్నారు.

స్వగ్రామానికి సేవ చేయడం అభినందనీయం

కేసముద్రం , ఆగస్టు 13: తాను పుట్టి పెరిగిన గ్రామంలోని పాఠశాల విద్యార్థులకు సేవ చేయడం అభినందనీయమని ఉప్పరపల్లి ప్రభుత్వ పాఠశాల హెచ్ఎం విజయ సుశీల అన్నారు. ఉప్పరపల్లి గ్రామానికి చెందిన అసిస్టెంట్ చీఫ్ కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్టు అధికారి ఎసల్ల కట్టయ్య రూ.30వేల విలువైన టై, బెల్టులు, బ్యాడ్జిలు, ఐడీ కార్డులను మంగళవారం ఆయన తండ్రి కట్టయ్య చేతుల మీదుగా పంపిణీ చేయించడం అభినందనీయమన్నారు. విద్యార్థులు దాతల సహకారాన్ని అందిపుచ్చుకొని పట్టుదలతో చదివి ఉన్నత శిఖరాలను అదిరోహించాలన్నారు.

విద్యార్థులకు టై, బెల్టులు అందిస్తున్న కట్టయ్య

అవయవ దానానికి ముందుకు రావాలి

కురవి, ఆగస్టు 13: అవయవ దానానికి ప్రతి ఒక్కరూ ముందుకు రావాలని, ఈ విషయంలో దేశంలోనే తెలంగాణ రాష్ట్రాన్ని ముందువరుసలో నిలపడానికి కృషి చేయాలని తెలంగాణ రాష్ట్ర అవయవదాన సంఘం ప్రధాన కార్యదర్శి డాక్టర్ అశోక్ కోరారు. కురవి మండల కేంద్రంలో దేవరశెట్టి మల్సూర్ ఆధ్వర్యంలో ప్రపంచ అవయవ దాన దినోత్సవాన్ని పురస్కరించుకొని జరిగిన కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. అనంతరం కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో కుమారస్వామి, గణేశ్, రామారావు, రాములు, నాయక్, కిషన్, అయోధ్య పాల్గొన్నారు.

కరపత్రాలను ఆవిష్కరిస్తున్న అశోక్

మొక్కలు నాటి సంరక్షించాలి

మహబూబాబాద్ రూరల్, ఆగస్టు 13: ప్రతి ఒక్కరూ మొక్కలను నాటి వాటిని సంరక్షించాలని సీపీఐ మున్సిపల్ ఫ్లోర్ లీడర్ అజయ్‌సారథి అన్నారు. మంగళవారం పట్టణంలోని కోర్టు సెంటర్ నుంచి మూడుకొట్ల జంక్షన్ వరకు మున్సిపాలిటీ ఆధ్వర్యంలో మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గతంలో నాటిన క్రోనోకార్పస్ మొక్కల వల్ల ప్రజలు ఆరోగ్య సమస్యలు ఉత్పన్నమవుతున్నాయని, వాటిని తొలగించి వేరే మొక్కలు నాటుతున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

తాగునీటి ఎద్దడిని నివారిస్తాం..

ఎంపీ బలరాం నాయక్

ఓవర్ హెడ్ ట్యాంకుల నిర్మాణానికి శంకు స్థాపన చేస్తున్న ఎంపీ, ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ, వార్డు మెంబర్లు, అధికారులు

మహబూబాబాద్ రూరల్, ఆగస్టు 13 : మున్సిపాలిటీ పరిధిలోని అన్ని కాలనీల్లో తాగునీటి ఎద్దడిని పూర్తిగా నివారిస్తామని ఎంపీ పోరిక బలరాంనాయక్ అన్నారు. మంగళవారం మున్సిపాలిటీ పరిధిలోని 18వ వార్డులో అమృత్ పథకంలో భాగంగా రూ.28.43 కోట్లతో 3 ఓవర్ హెడ్ ట్యాంకులకు ఎమ్మెల్సీ తక్కళ్లపల్లి రవీందర్‌రావు, ఎమ్మెల్యే మురళీనాయక్‌తో కలిసి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ.. మున్సిపాలిటీ విలీన గ్రామాల్లో తాగునీటి కొరతను నివారించే ప్రదాన ఉద్దేశంతో వాటర్ ట్యాంకులను ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత దశలవారీగా పెండింగ్‌లో ఉన్న సమస్యలను పరిష్కరిస్తున్నామన్నారు. ఎన్నికల ముందు ఇచ్చిన అన్ని హామీలు అమలు చేస్తామన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ రామ్మోహన్‌రెడ్డి, వైస్ చైర్మన్ మార్నేని వెంకన్న, కౌన్సిలర్లు జనార్దన్, ఎడ్ల వేణు, సోమయ్య, అజయ్ సారథి, పోతు రాజు, హరిసింగ్, అధికారులు పాల్గొన్నారు.

పేదలందరికీ సంక్షేమ ఫలాలు

పేదలందరికీ సంక్షేమ ఫలాలు అందజేస్తామని ఎంపీ పోరిక బలరాంనాయక్ అన్నారు. మంగళవారం పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే మురళీనాయక్‌తో కలిసి మానుకోట మండల లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ..ఎన్నికల్లో ఇచ్చిన హామీ సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నామన్నారు. త్వరలోనే పేదలకు ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేస్తామన్నారు. 103 మంది లబ్ధిదారులకు రూ.1,03,11,948 విలువైన చెక్కులను అందజేశామన్నారు. ఈ కార్యక్రమంలో మిట్టకంటి రాంరెడ్డి, పోతురాజు, వార్డ్ మెంబర్లు పాల్గొన్నారు.

వాహనాల తనిఖీలు

కురవి, ఆగస్టు 13: కురవి మండల కేంద్రంలోని 365 జాతీయ రహదారిపై మహబూబాబాద్ రూరల్ సీఐ సర్వయ్య ఆధ్వర్యంలో మంగళవారం వాహన తనిఖీలు చేపట్టారు. ఎస్సీ సుధీర్‌రాంనాథ్ కేకన్ ఆదేశాల మేరకు స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకొని ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా తనిఖీలు చేపట్టినట్లు సీఐ తెలిపారు. ఎస్సై బైరు గోపీ, సిబ్బంది పాల్గొన్నారు.

సీరోలు టీపీటీఎఫ్ మండల కమిటీ

బాబురావు

విద్యాసాగర్

కురవి(సీరోలు), ఆగస్టు 13 : తెలంగాణ ప్రోగ్రాం టీచర్స్ ఫెడరేషన్ సీరోలు మండల కమిటీని మంగళవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండల అధ్యక్షుడిగా ఏ బాబూరావు, మండల ప్రధాన కార్యదర్శిగా సజ్జనము విద్యాసాగర్‌ను ఎన్నుకున్నారు. ఎన్నికల అధికారిగా బీ శ్రీనివాస్ వ్యవహరించగా, ముఖ్యాతిథులుగా జిల్లా అధ్యక్షుడు చుంచు శ్రీశైలం హాజరై మాట్లాడారు. పెండింగ్‌లోని బిల్లులను వెంటనే విడుదల చేయాలన్నారు. కురవి మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు విజయ్‌కుమార్, శివకుమార్, సింగం మనోహర్, పొద్దుటూరి రమేశ్, వీరేందర్, రవీందర్, వేణు, సునీల్‌కుమార్, రహీ మొద్దీన్, రవికిరణ్, కిరణ్‌కుమార్, సుభాషిణి, అశ్విని కుమారి పాల్గొన్నారు.

తహసీల్దార్‌కు వినతి

కురవి(సీరోలు), ఆగస్టు 13 : రూ.2లక్షల రైతు రుణమాఫీలో భాగంగా రేషన్ కార్డులింక్ లేకుండా బ్యాంకులో రుణం తీసుకున్న ప్రతి రైతుకూ మాఫీ వర్తింపజేయాలని సీపీఎం ఆధ్వర్యంలో రైతులు తహసీల్దార్ ఆర్ శారద, వ్యవసాయ అధికారికి మంగళవారం వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో రైతులు తేజావత్ దంజ్యానాయక్, రాంకోటి, రవి, అంజయ్య, ఎర్రబాటి మల్సూర్, భద్రూనాయక్, అట్టూరి ఇస్తారి, తదితరులు పాల్గొన్నారు.

జర్వంతో బాలుడి మృతి

గణేశ్(ఫైల్)

ఇనుగుర్తి, ఆగస్టు 13: విషజ్వరంతో మండల కేంద్రానికి చెందిన బాలుడు మృతి చెందాడు. బాలుడి తండ్రి సతీశ్ కథనం ప్రకారం.. ఇస్సంపెల్లి సతీశ్ గణేశ్(4) విషజ్వరంతోపాటు కామెర్ల సోకి మృతి చెందాడు. బతుకు దెరువు కోసం హైదరాబాద్‌కు వెళ్లి కూలీ పని చేసుకుంటున్నారు. గణేశ్ వారం రోజులుగా జ్వరం వస్తుండడంతో గాంధీ హాస్పిటల్‌లో చేర్పించగా చికిత్స పొందుతూ మంగళవారం సాయంత్రం మృతి చెందాడు. గణేశ్ మృతితో తండ్రి సతీశ్, తల్లి కన్నీటి పర్యంతమయ్యారు.

మాజీ ఎమ్మెల్యే రెడ్యానాయక్‌కు సన్మానం

చిన్నగూడూరు, ఆగస్టు 13: మండలంలోని ఉగ్గంపల్లిలో మాజీ ఎమ్మెల్యే రెడ్యానాయక్‌ను కందికొండ రెవెన్యూ పరిధిలోని బంజారా తండావాసులు మంగళవారం మర్యాద పూర్వకంగా కలిసి సన్మానించారు. బంజరతండాను గ్రామ పంచాయతీగా ఏర్పాటు చేసేందుకు కృషి చేసిన రెడ్యాకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల నాయకులు పిచ్చిరెడ్డి, రవినాయక్, యాక్యానాయక్, జవహార్ లాల్, చందు, హరికిషన్ పాల్గొన్నారు.

రెడ్యానాయక్‌ను సన్మానిస్తున్న బంజారతండా వాసులు

విస్తృతంగా పాల సేకరణ కేంద్రాల ఏర్పాటు

విజయ డెయిరీ వరంగల్ డీడీ శ్రావణ్‌కుమార్

తొర్రూరు, ఆగస్టు 13: ఉమ్మడి వరంగల్ జిల్లాలో విస్తృతంగా పాల సేకరణ కేంద్రాల ఏర్పాటు లక్ష్యంగా విజయ డెయిరీ కార్యచరణ రూపొందించినట్లు వరంగల్ డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ కే శ్రావణ్‌కుమార్ తెలిపారు. వెలికట్ట శివారులోని పాల శీతలీకరణ కేంద్రాన్ని మంగళవారం విజయ డెయిరీ డీడీ సందర్శించారు. పాల కేంద్రం చైర్మన్ రాసాల సమ్మయ్య అధ్యక్షతన నిర్వహించిన పాడి రైతుల సమావేశంలో పాల ఉత్పత్తి పెంచేందుకు తీసుకోవాల్సిన చర్యలపై చర్చించారు. పాలశీతలీకరణ కేంద్రం భూములు ఆక్రమణలకు గురవుతున్నాయని, స్థలాల రక్షణ కోసం చుట్టూ ప్రహరీ నిర్మించాలని చైర్మన్ సమ్మయ్య డీడీని కోరారు. అనంతరం పాలకేంద్రం భూములను డీడీ పరిశీలించారు. పలువురు పాలకేంద్రం భూమిలో రాళ్లు నాటడంపై చైర్మన్, సిబ్బందితో మాట్లాడారు. ఉన్నతాధికారులతో మాట్లాడి పాలకేంద్రం భూమిలో ప్రహరీ ఏర్పాటుకు కృషి చేస్తామని డీడీ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విజయ డెయిరీలో పాలు విక్రయించే రైతులకు లీటరుకు రూ.4 ఇన్సెంటివ్ పెంచామన్నారు. మిల్క్ పార్లర్ల ఏర్పాటుకు ప్రోత్సాహం అందిస్తున్నామని, ఉమ్మడి వరంగల్ జిల్లాలోని తొర్రూరు, పెద్దవంగర, దంతాలపల్లి, రాయపర్తి, పాలకుర్తితో పాటు మేజర్ జీపీ తదితర ప్రాంతాల్లో మిల్క్ పార్లర్ చేయాలనుకునే వారు సమీపంలోని ఉన్న పాలశీతలీకరణ కేంద్రాల్లో సంప్రదించాలన్నారు. పాలు పోసిన రైతులకు 15 రోజులకు ఒకసారి డబ్బులు ఇప్పించాలని, మిల్క్ టెస్టింగ్ అనలైజర్లు ఇవ్వాలని, పాలకేంద్రం చుట్టూ ప్రహరీ నిర్మించాలని, దాణా బస్తాలు, మినరల్ మిక్చర్ అందించాలని, పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో పాడి పశువులకు హెల్త్ క్యాంపు నిర్వహించాలని డీడీని రైతులు కోరారు. ఈ కార్యక్రమంలో విజయ డెయిరీ కార్యదర్శి ప్రభాకర్‌రెడ్డి, మేనేజర్ హనుమంతు, ఉపాధ్యక్షుడు సుధాకర్‌రెడ్డి, సభ్యుడు శ్రీను, సిబ్బంది వెంకటనారాయణ, రమేశ్, అశోక్, చంద్రమౌళి, రైతులు పాల్గొన్నారు.

పాడి రైతులతో మాట్లాడుతున్న డీడీ శ్రావణ్‌కుమార్

అంబేద్కర్ ఆశయ సాధనకు కృషి చేయాలి

తొర్రూరు, ఆగస్టు 13: డాక్టర్ బీఆర్ అంబేద్కర్ ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఎస్సీ మోర్చా జిల్లా అధ్యక్షుడు తూర్పాటి సాయిముఖేశ్ అన్నారు. హర్ గర్ తిరంగా అభియాన్‌లో భాగంగా మంగళవారం తొర్రూరు పట్టణంలో ఎస్సీ మోర్చా ఆధ్వర్యంలో అంబేద్కర్ విగ్రహానికి పాలాభిషేకం చేసి పూలమాల చేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా కార్యదర్శి, తొర్రూరు మున్సిపల్ కౌన్సిలర్ కొలుపుల శంకర్, తొర్రూరు అర్బన్ అధ్యక్షుడు అలిసేరి రవిబాబు, రూరల్ అధ్యక్షుడు కస్తూరి పులేందర్, రూరల్ మండల ప్రధాన కార్యదర్శి యాకన్న, ఎస్సీ మోర్చా మండల అధ్యక్షుడు రవితేజ పాల్గొన్నారు.

పట్టుదలతో చదవాలి

మహబూబాబాద్ రూరల్, ఆగస్టు 13 : విద్యార్థులు పట్టుదలతో చదివి ఉన్నత లక్ష్యాలను చేరుకోవాలని మండలంలోని కంబాలపల్లి ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల హెచ్ ఎం జీ లక్ష్మి సూచించారు. మంగళవారం స్ఫూర్తి ఎడ్యుకేషన్ సొసైటీ, తెలుగు సమితి ఆఫ్ నుబ్రా స్కా ఆధ్వర్యంలో విద్యార్థులకు టీ షర్ట్‌లను అందజేశారు. ఈ కార్యక్రమంలో స్ఫూర్తి ఎడ్యుకేషన్ అధ్యక్షుడు రామ సహాయం శ్రీధర్‌రెడ్డి, రమేశ్, కృష్ణయ్య, రవి, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

పీహెచ్‌సీ ఎదుట ధర్నా చేస్తున్న పీవైఎల్, పీవోడబ్ల్యూ నాయకులు

వైద్యసేవలు అందించడంలో ప్రభుత్వం విఫలం

బయ్యారం, ఆగస్టు 13 : ప్రజలకు వైద్యసేవలు అందించడంలో ప్రభుత్వం విఫలమైందని పీవోడబ్ల్యూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఊకే పద్మ, పీవైఎల్ జిల్లా అధ్యక్షుడు వీరభద్రం అన్నారు. మంగళవారం బయ్యారం పీహెచ్‌సీ ఎదుట ధర్నా నిర్వహించిన అనంతరం ఆయన మాట్లాడుతూ.. ప్రతి ఇంట్లో ఇద్దరు ముగ్గురు విషజ్వరాలతో బాధపడుతున్నారని, ప్రభుత్వం వైద్యశాలల్లో సౌకర్యాలు కల్పించకపోవడంతో ప్రైవేటు వెళ్లి అధిక ఫీజులతో ఇబ్బందిపడుతున్నారని అన్నారు. మండలంతో వైద్య సిబ్బంది పోస్టులను భర్తీ చేయకపోవడంతో గిరిజన పేద ప్రజలకు సరైన వైద్యం అందడం లేదన్నారు. మండలంలో రావుల మంగమ్మ, ఇస్లావత్ దల్‌సింగ్ , మాలోత్ శ్రీనివాస్ డెంగీతో మృతిచెందారని అన్నారు. అయినా అధికారులు నిర్లక్ష్యం వీడడం లేదన్నారు. ఈ క్రమంలోనే పీహెచ్‌సీ సందర్శనకు వచ్చిన కలెక్టర్‌కు సమస్యను వివరించారు. ఈ కార్యక్రమంలో నాయకులు మోకాళ్ల మురళీ కృష్ణ, రామగిరి భిక్షం, తుడుం అనురాధ, జినక రేణుక, నేతకాని రాకేశ్, నాగేశ్వరరావు, శేషు, దేవీరెడ్డి పాల్గొన్నారు.

అక్టోబర్‌లో సర్పంచ్ ఎన్నికలు

ప్రభుత్వ విప్ రాంచంద్రూనాయక్

దంతాలపల్లి, ఆగస్టు 13: వచ్చే అక్టోబర్‌లో సర్పంచ్ ఎన్నికలు జరగొచ్చని, పార్టీ నాయకులు, కార్యకర్తలు సిద్ధంగా ఉండాలని డోర్నకల్ ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ రాంచంద్రూనాయక్ అన్నారు. మండల కేంద్రంలోని బాలాజీ ఫంక్షన్ హాల్‌లో నిర్వహించిన ముఖ్య కార్యకర్తల సమవేశంలో ఆయన మాట్లాడుతూ.. పార్టీలో సీనియర్లమని చెప్పుకుంటే పదవులు రావని, ప్రజల ఆదరణ ముఖ్యమన్నారు. భట్టూనాయక్, రాజశేఖర్, లింగరెడ్డి, బాలాజీ, రవీందర్, గురుపాల్‌రెడ్డి, సతీశ్, యాకన్న, రాములు, గిర్వాణి, సంపత్, సురేశ్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే రాంచంద్రూనాయక్

జర్నలిస్టు యోగికి నివాళి

దంతాలపల్లి, ఆగస్టు 13: వరంగల్‌లో ఇటీవల ఆత్మహత్య చేసుకున్న జర్నలిస్టు యోగి చిత్రపటానికి మంగళవారం మండల కేంద్రంలోని అంబేద్కర్ సెంటర్‌లో మండల జర్నలిస్టులు నివాళులర్పించారు. ప్రెస్‌క్లబ్ మండల అధ్యక్షుడు నిరంజన్, కార్యదర్శి మురళి, ఐలయ్య, పంతం విజయేందర్, విజయ్, జుంకీలాల్, నరేందర్, సురేందర్, రమేశ్ పాల్గొన్నారు.

22న చలో హైదరాబాద్

తొర్రూరు, ఆగస్టు 13: ప్రజలకిచ్చిన హామీలను అమలు చేయాలనే డిమాండ్‌తో సీపీఐ(ఎంఎల్)మాస్ లైన్ రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో ఈ 22న చేపట్టిన చలో హైదరాబాద్ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని తొర్రూరు డివిజన్ కార్యదర్శి ముంజంపల్లి వీరన్న పిలుపునిచ్చారు. ఈ మేరకు మంగళవారం డివిజన్ కేంద్రంలో కరపత్రాన్ని ఆవిష్కరించి మాట్లాడారు. పెద్దవంగర, తొర్రూరు, దంతాలపల్లి మండలాల సంయుక్త కార్యదర్శి చింతా నవీన్, మంగళపల్లి సాయిలు, మధు, వెంకన్న, ఐలయ్య, శరత్, యాకయ్య, మల్లయ్య పాల్గొన్నారు.

అంగన్‌వాడీ సెంటర్లను పరిశీలించిన సీడీపీవో

అంగన్‌వాడీ సెంటర్‌ను పరిశీలిస్తున్న సీడీపీవో ఎల్లమ్మ

నర్సింహులపేట, ఆగస్టు 13: మండలంలోని గోల్‌తండా, బోడ్కతండా అంగన్‌వాడీ సెంటర్లను మంగళవారం సీడీపీవో పరిశీలించారు. మంగళవారం 'నమస్తే తెలంగాణ'లో 'టీచర్లు రారు.. సీడీపీవో పట్టించుకోరు' అనే శీర్షికతో ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. మరిపెడ ప్రాజెక్టు సీడీపీవో ఎల్లమ్మ ఆయా సెంటర్లను పరిశీలించారు. గోల్‌తండా అంగన్‌వాడీ సెంటర్‌లో రికార్డులు ఇంటి వద్ద ఉన్నాయని చెప్పడం, ఎలాంటి రిజిస్టర్లు, బాలామృతం, సరుకుల నిల్వలు చూపకపోవడంతో అంగన్‌వాడీ టీచర్‌పై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎలాంటి సమాచారం ఇవ్వకుండా సెంటర్‌కు గైర్హాజరైన మరో టీచర్ మెమో జారీ చేశారు. ఈ సందర్భంగా సీడీపీవో మాట్లాడుతూ అంగన్‌వాడీ టీచర్లు సమయ పాలన పాటించి, పిల్లలకు, గర్భిణులు, బాలింతలకు పౌష్టికాహారం అందించాలన్నారు.

ప్రమాదాల నివారణపై అవగాహన ఉండాలి

డోర్నకల్, ఆగస్టు 13: అగ్ని ప్రమాదాల నివారణపై ప్రజలు అవగాహన కలిగి ఉండాలని ఎస్ఎఫ్‌వో వీరేశ్ అన్నారు. మంగళవారం ప్రాథమిక ఆరోగ్యం కేంద్రంలో అగ్ని ప్రమాదాలపై నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో మాట్లాడుతూ... అగ్ని ప్రమాదాలు జరిగినప్పుడు 102 హెల్ప్‌లైన్ నంబరుకు ఫోన్ చేసి సమాచారం ఇవ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో ఫైర్ స్టేషన్ సిబ్బంది శ్రీనివాస్, సురేశ్, సంపత్ తదితరులు పాల్గొన్నారు.

నిలిచిన అమ్మ ఒడి వాహనం

అమ్మఒడి వాహనాన్ని తోస్తున్న యువకులు

కేసముద్రం , ఆగస్టు 13: వరంగల్ జిల్లా నెక్కొండ మండలం నాగారం నుంచి ఐదుగురు గర్భిణులతో వెళ్తున్న 102 అమ్మఒడి వాహనం సాంకేతిక లోపంతో మంగళవారం కేసముద్రంలో నిలిచిపోయింది. గర్భిణులు వైద్య పరీక్షల కోసం అలంక